అతిథి అధ్యాపకుల అవస్థలు

- విద్యాసంవత్సరం ముగుస్తున్నా.. అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లాల్లో 250 మంది..


ఇంటర్‌బోర్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు (ఫైల్)

కల్వకుర్తి రూరల్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు సరిగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అర్ధాకలితో పాఠాలు బోధిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 56 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో 250 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికిగాను జూన్‌ నుంచి విధులకు హాజరవుతున్నా 4 నెలలకు ఓసారి మాత్రమే ఇంటర్‌బోర్డు వేతనాలు చెల్లిస్తోంది. 2023, ఫిబ్రవరి బడ్జెట్‌లో అతిథి అధ్యాపకులకు 12 నెలల వేతనం అందజేయాలని అధికారులకు అప్పటి ముఖ్యమంత్రి ఆదేశించినా ఫలితం శూన్యం.

ఆటో రెన్యూవల్‌ లేదు..

అతిథి అధ్యాపకులకు ఆటో రెన్యూవల్‌ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్‌బోర్డు కొత్త నోటిఫికేషన్‌ జారీ చేసింది. దీంతో గెస్ట్‌ లెక్చరర్లు హైకోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన ధర్మాసనం కొత్త నోటిఫికేషన్‌ చెల్లదని.. పాత వారినే కొనసాగించాలని, ఆటో రెన్యూవల్‌ ఇవ్వాలని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంతో గెస్ట్‌ లెక్చరర్లు తమ ఆందోళనను ఉధృతంగా చేయడంతో సమస్య కొద్దిమేర సద్దుమణిగింది.

గుర్తింపు కరువు..

అతిథి అధ్యాపకులు పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా సరైన గుర్తింపు లేకపోవడంతో పాటు రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌ లెక్చరర్లతో సమానంగా పనిచేసి శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా..

తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, జేఏసీ చైర్మన్‌ కోదండరాం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు రెండురోజుల క్రితం ఇంటర్‌ విద్యాకమిషనర్‌ శృతి ఓఝాకు గెస్ట్‌ లెక్చరర్లు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు వేతనాలు అందించాలని కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వంలోనైనా..

ప్రతి ఏటా జూన్‌ 1 నుంచి మరుసటి ఏడాది మార్చి 31 వరకు గెస్ట్‌ లెక్చరర్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. అందుకు అనుగుణంగా గత ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అయినప్పటికీ తమ వేతనాలపై ఇంటర్‌బోర్డు పట్టింపులేని వైఖరి కనబరుస్తుందని గెస్ట్‌ లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా 3, 4 నెలలకు ఓసారి వేతనాలు చెల్లిస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. గత ప్రభుత్వం కొందరిని క్రమబద్ధీకరించిందని.. అదే తరహాలో తమపై జాలి చూపకపోగా వేతనాలు సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులు సృష్టిస్తుందని వివరించారు. కొత్త ప్రభుత్వమైనా విద్యాసంవత్సరం ముగిసేలోపు పెండింగ్‌ వేతనాలు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఆటో రెన్యూవల్‌తో పాటు కోర్టు ఆదేశాలు అమలు చేయాలని వేడుకుంటున్నారు.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	కళాశాలలు	అతిథి అధ్యాపకులు
నాగర్‌కర్నూల్‌	15	73
మహబూబ్‌నగర్‌	13	63
వనపర్తి	12	47
జోగుళాంబ గద్వాల	8	35
నారాయణపేట	8	32

ఉద్యోగ భద్రత కల్పించాలి..



హైకోర్టు తీర్పును అమలు చేయడంతో పాటు ఎంటీఎస్‌ (మినిమం టైమ్‌ స్కేల్‌) ఇవ్వాలి. రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌ లెక్చరర్లతో సమానంగా పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నాం పెండింగ్‌ వేతనాలు చెల్లించడంతో పాటు 72 పీరియడ్స్‌ విధానాన్ని రద్దుచేసి 12 నెలల కన్సాలిడేట్‌ పే ఇవ్వాలి. కాంగ్రెస్‌పార్టీ మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సదానందంగౌడ్‌, రాష్ట్ర నాయకుడు, గెస్ట్‌ లెక్చరర్ల సంఘం

నాగర్‌కర్నూల్‌ డీఈఓపై దాడికి యత్నం


అధికారులను చుట్టుముట్టిన కాంగ్రెస్‌ కార్యకర్తలు

- ప్రొటోకాల్‌ విస్మరించారంటూ ఆగ్రహం
- పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే.. వెనుదిరిగిన ఎమ్మెల్యే

తాడూరు: మండలంలోని సిర్సవాడలో ఎంజేఆర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ప్రొటోకాల్‌ పాటించకుండా తమను అవమానపర్చారంటూ నాగర్‌కర్నూల్‌ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అనుచరులు దాడికి యత్నించారు. పోలీసులు వెంటనే డీఈఓను స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎంజేఆర్‌ ట్రస్టు ద్వారా గ్రామంలో ఆధునిక హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఆదివారం పాఠశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కానీ ఆయన హాజరయ్యే సమయానికి ముందే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రారంభించడంతో ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాల భవనానికి బీఆర్‌ఎస్‌ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్‌ నేతలు, ప్రజాప్రతినిధులు డీఈఓను ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. వెంటనే పోలీసులు డీఈఓను అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తనను ప్రారంభోత్సవానికి పిలిచి అవమానించారంటూ డీఈఓ, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించకుండానే వెనుదిరిగారు.

ప్రారంభోత్సవం వాయిదా..

కందనూలు: ప్రొటోకాల్‌ ఉల్లంఘన కారణంగా సిర్సవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా వేసినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల హెచ్‌ఎం చాంద్‌పాషాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్‌ ప్రకారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, దాత, ఎంజేఆర్‌ ట్రస్ట్‌ అధినేత మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించామన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆయన అనుచరులతో ముందుగానే వచ్చారని.. ప్రధానోపాధ్యాయుడు వద్దని వారించినప్పటికీ వినిపించుకోకుండా వెంట తెచ్చుకున్న రిబ్బన్‌ను పాఠశాల గేట్‌కి కట్టి ప్రారంభించారని తెలిపారు. అనంతరం లోపలికి వచ్చి 2022లో వేసిన నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రారంభించి వెళ్లారని వివరించారు. తర్వాత వచ్చిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వచ్చి హెచ్‌ఎంతో మాట్లాడి వివరాలు తెలుసుకొని వెనుదిరిగారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రొటోకాల్‌ను ఉల్లంఘించినందుకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే.. : మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: తన చివరి శ్వాస వరకు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంజేఆర్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన సిర్సవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నప్పుడు తను, తన సోదరుడు ఈ పాఠశాలలోనే చదువుకున్నామని.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో అన్ని వసతులతో కార్పొరేట్‌కు దీటుగా నిర్మించామన్నారు. తిమ్మాజిపేటలోనూ నిర్మించి ప్రారంభించామని.. త్వరలోనే తాడూరు, కుమ్మెరలో నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి మర్రి జమున, సోదరుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్‌, ఎంపీపీ శ్రీదేవి, డీఈఓ గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యురాలు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్‌–జడ్చర్ల ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ చంద్రమోహన్‌ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూత్పూర్‌ మండలం తాటిపర్తికి చెందిన బిజిలి శివకుమార్‌(21) తన మిత్రుడు చాపల శివకుమార్‌తో కలిసి శనివారం రాత్రి బైక్‌పై గంగాపూర్‌ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. బైక్‌పై జడ్చర్ల వైపునకు వస్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వైద్యచికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేరోజు అర్ధరాత్రి బిజిలి శివకుమార్‌ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఆత్మహత్య కేసులో వ్యక్తి రిమాండ్‌

బిజినేపల్లి: మండలంలోని పాలెంకు చెందిన పుష్పలత ఈ నెల 5న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు రిమాండ్‌ విధించినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలెంకి చెందిన శ్రీకాంత్‌, పుష్పలతతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసికంగా వేధించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీకాంత్‌ ఈ విషయాన్ని ఒప్పుకోవడంతో అతడిని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండ్‌ విధించినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలియజేశారు.

చీటి డబ్బులతో మహిళ పరారీ

వనపర్తిటౌన్‌: జిల్లా కేంద్రంలోని కేడీఆర్‌ కాలనీలో నివాసముంటున్న ఉషారాణి కాలనీ వాసులతో కలిసి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు చీటీలు వేసేది. ఈక్రమంలో చీటి డబ్బుల కోసం పాదుపుదారులు వెళ్తే.. ఈ సారి డిప్‌ మీకు రాలేదని.. చీటి అనంతరం డబ్బులు ఇస్తానని నమ్మబలకడంతో పాటు ప్రమిసరీ నోట్‌ రాసిచ్చింది. ఈనెల 1వ తేదీన చీటి డబ్బులు ఇస్తానని చెప్పిందని.. ఇంటికి వెళ్లి చూస్తే తాళంవేసి ఉన్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బస్సులో బంగారం చోరీ

తెలకపల్లి: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీ జరిగింది. హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌ పట్టణానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె శిరీష ఈ నెల 13న నాగర్‌కర్నూల్‌ వెళ్లేందుకు అచ్చంపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యంలో ఇద్దరు వృద్ధ మహిళలు బస్సు ఎక్కి మోకాలు నొప్పులు ఉన్నాయని శిరీషను సీటు అడిగారు. ఆమె లేచి నిలబడి ఆ సీటు మహిళలకు ఇచ్చింది. శిరీష బ్యాగు కూడా అదే సీటులో పెట్టుకుని కూర్చున్నారు. తెలకపల్లి సమీపంలోని పర్వతాపూర్‌ రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్‌ బంకు వద్ద ఆ మహిళలు హడావుడిగా దిగి వెళ్లిపోయారు. శిరీష నాగర్‌కర్నూల్‌ వెళ్లి తన బ్యాగు తెరిచి చూడగా.. బ్యాగులోని ఆరున్నర తులాల బంగారం కనిపించలేదు. శిరీషకు తన సీటులో కూర్చున్న మహిళలే బంగారం చోరీ చేసి ఉంటారని శిరీష తండ్రి శ్రీనివాసులు ఆదివారం పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్‌ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ముగిసిన ధన్వంతరి వెంకన్న బ్రహ్మోత్సవాలు


బల ప్రదర్శనలో పాల్గొన్న వృషభరాజులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్‌ మినీ స్టేడియంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి సీనియర్‌ విభాగం వృషభరాజుల బండలాగు పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎద్దులు పోటీల్లో తలపడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్‌ టోర్నీ రాత్రి వరకు కొనసాగింది. అదేవిధంగా ఇసుక సంచి, సందెరాళ్లు, దొబ్బడ గుండ్లు ఎత్తే పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే విజయుడు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌ కుమార్‌ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

గుబ్బల గుండు ఎత్తు పోటీలో వడ్డేపల్లి మండలం జూలకల్లుకు చెందిన రంగస్వామి ప్రథమ, రాజోళి మండలం పచ్చర్లకు చెందిన షకీర్‌ ద్వితీయ బహుమతులు సాధించారు. ఇసుక సంచి ఎత్తే పోటీల్లో రాయచూరు జిల్లా దేవదుర్గంకు చెందిన పరుశరాంనాయక్‌ ప్రథమ, యాదగిరి జిల్లా శారదపల్లికి చెందిన మరియప్పనాయక్‌ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సందరాళ్ల ఎత్తు పోటీలో గట్టు మండలం మిట్టదొడ్డికి చెందిన ఉరుకుంద ప్రథమ, గట్టు మండలం బల్గెరకు చెందిన హనమంతు ద్వితీయ బహుమతులను సాధించారు. దొబ్బడ గుండ్లు ఎత్తు పోటీల్లో గద్వాల మండలం వెంకటపురం గ్రామానికి చెందిన లాల్‌బాషా ప్రథమ, రాజోళి మండలం పచ్చర్లకు చెందిన ఉపేంద్ర ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బాస్కెట్‌బాల్‌ పోటీల్లో అట్మస్క్‌ జట్టు ప్రథమ, డాన్‌ బాస్కో జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

పాలెం వెంకన్నకు చక్రస్నానం

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయ అర్చక బృందం అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామికి ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరిరోజు నిత్యారాధన హోమం, పూర్ణాహుతి, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించి ఆలయబావి వద్ద చక్రస్నానం పూర్తి చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి వీధుల్లో ఊరేగించగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. మేళతాళాలు, భక్తి కీర్తనలు, భజనలతో కోలాహలంగా మారింది.


ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

తైక్వాండో అసోసియేషన్‌ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్‌ కార్యవర్గం

గద్వాల: తెలంగాణ రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్‌ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గం ఎన్నికకు తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా నుంచి అచ్యుత్‌రెడ్డి, శరత్‌చంద్ర ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో కరాటే అసోసియేషన్‌ నూతన అధ్యక్షుడిగా ముతా శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి శ్రీహరి ఎన్నికయ్యారు. టెక్నికల్‌ చైర్మన్‌గా వెంకటస్వామి, టెక్నికల్‌ డైరెక్టర్లుగా మల్లికార్జున్‌గౌడ్‌, రామాంజనేయులు, కోశాధికారిగా సంతోష్‌, స్టేట్‌ ఆఫీస్‌ సెక్రెటరీ రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రీహరి గద్వాల వాసి. ఈయన ఎన్నిక కావడం ఇది మూడో సారి. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని వివిధ జిల్లాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్‌ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎన్నికైన వారు పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత: కేసు నమోదు


స్టేషన్‌ ఆవరణలో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

తాడూరు: మండలంలోని మేడిపూర్‌ వద్ద దుందుభి వాగు నుంచి అక్రమ ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుట్ట మహేష్‌ తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా.. సమాచారం మేరకు పట్టుకుని స్టేషన్‌ ఆవరణలో ఉంచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పేర్కొన్నారు.

టిప్పర్‌ పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్‌ ఆదివారం తెలియజేశారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొండపేట సమీపంలోని కృష్ణానది నుంచి టీఎస్‌ 33 టి 5382 నంబర్‌ టిప్పర్‌లో ఎర్రవల్లికి శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి కేజీబీవీ సమీపంలో పోలీసులు తనిఖీ చేసి ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. అనంతరం టిప్పర్‌ను పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మున్సిపల్‌ కార్మికులను రెగ్యులరైజ్‌ చేయాలి



మాట్లాడుతున్న సూర్యం

ఆత్మకూర్‌: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్‌ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆత్మకూర్‌లో మున్సిపల్‌ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని, ఈపీఎఫ్‌ను నిబంధనల ప్రకారం అమలు చేయాలని, ఈఎస్‌ఐ కార్డులను పంపిణీ చేయాలన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలను ఇవ్వాలని, అవసరమైన సామగ్రిని సమకూర్చాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో హన్మంతు, రాజు, ప్రసాద్‌, సామేలు, ప్రేమరత్నం, వెంకటేష్‌, సత్యన్న, ఏసేపు, ఇస్మాయిల్‌, మైను, దశరథ్‌, రమేష్‌, పద్మ, శివకుమార్‌, రేణుక, సత్యమ్మ ఉన్నారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగ కొనసాగుతుంది. ఆదివారం 1,018 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వార వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

ఎర్రవల్లిలో దొంగల హల్‌చల్‌

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణం, కిరాణ షాపులతో పాటు కొండేరులోని ఓ ఇంట్లో చోరీ చేసేందుకు యత్నించారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి చోరీలకు పాల్పడకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. దొంగల సంచారానికి సంబంధించిన వీడియోలు సోషల్‌ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిషయంపై ఎస్‌ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు మధ్యాహ్న భోజనం


అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌ యార్డుకు పంటలు విక్రయించేందుకు వచ్చే రైతులకు సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్‌ చిక్కుడు వంశీకృష్ణ హాజరై ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేరుశనగ పంటలు అమ్ముకునేందుకు వచ్చిన రైతుల ఆకలిని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంటలు అమ్ముకునేందుకు రైతులు మార్కెట్‌కు వస్తున్నారని, వారు రోజంత లేదా రెండు రోజులు కూడా మార్కెట్లో ఉండాల్సిన పరిస్థితి గమనించి భోజన ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ ప్రత్యేకాధికారి సరోజ, మార్కెట్‌ కార్యదర్శి నర్సింహ, కౌన్సిలర్‌ గౌరిశంకర్‌, ఎ.గోపాల్‌రెడ్డి, కటకం రఘురాం, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అండగా ఉంటాం..

భవన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న తాపీ మేస్త్రీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్‌ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మిగిలిన భవన నిర్మాణ పనుల కోసం రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెల లేబర్‌ అధికారితో సమావేశం ఏర్పాటు చేసిన తాపీ మేస్త్రీల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు బోయ ఖాజ, కిష్టయ్య, డి.తిరుపతయ్య, గార్లపాటి సుదర్శన్‌, అర్జునయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాప్‌కు యత్నం

అడ్డాకుల: కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చిన్న పిల్లలను ఎత్తుకెళ్లడానికి యత్నించిన ఘటన మూసాపేటలో ఆదివారం కలకలం రేపింది. గ్రామస్తుల కథనం మేరకు.. ముగ్గురు వ్యక్తులు ఆటోలో గ్రామానికి వచ్చి రేషన్‌ బియ్యం కొంటామని వీధుల్లో తిరిగారు. ఇందులో ఒకరు కుమ్మరి గేరిలో తిరుగుతూ కుమ్మరి నగేష్‌ కుమారుడిని పట్టుకుని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. కొద్ది దూరం వెళ్లాక ఆ బాలుడు వారిని రాయితో కొట్టి తప్పించుకున్నాడు. ఇంతలోనే అక్కడున్న వారు అరవడంతో వారు పారిపోయారు. స్థానికులు ఊరంతా గాలించినా దొరక్కపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని గ్రామంలో మైక్‌ద్వారా ప్రచారం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. దీనిపై ఎస్‌ఐ కె.సుజాత మాట్లాడుతూ.. చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే వారు గ్రామాల్లో తిరుగుతున్నారన్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు.

నల్లమలలో కార్చిచ్చు

- ఫైర్‌ వాచర్‌కు గాయాలు


మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

అమ్రాబాద్‌: నల్లమలలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. అమ్రాబాద్‌ మండలంలోని తాడిగుండాల, తిమ్మారెడ్డిపల్లి, వజ్రాలమడుగు ప్రాంతాల్లో ఆదివారం మంటలు చెలరేగాయి. గుర్తించిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. అదుపులోకి రాలేదని సమాచారం. దాదాపు 10 కి.మీ. మేర అటవీ ప్రాంతం కాలిపోయినట్లు తెలుస్తోంది. అయితే మంటలను ఆర్పుతున్న క్రమంలో ఫైర్‌ వాచర్‌ పోతయ్యకు గాయాలయ్యాయి. వేసవిలో అటవీ ప్రాంతాన్ని అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు ఫైర్‌ వాచర్లను నియమిస్తారని, వారికి పూర్తి స్థాయి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలపెంట రేంజ్‌ పరిధిలో అటవీ సంరక్షణకు బాధ్యతగా పనిచేస్తున్నామని, అయినప్పటికీ అక్కడక్కడ మంటలు అంటుకుంటున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ గురుప్రసాద్‌ తెలిపారు.

క్లుప్తంగా

సీఓఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల/కళాశాలలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 375 మంది పరీక్షకు హాజరయ్యారని పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి, డిపార్టుమెంటల్ అధికారిణి వాణి సరళ తెలిపారు. 9 మంది విద్యార్థులు గైర్హజరయ్యారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నేషనల్ హైవే పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 జాతీయ రహదారి పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో సైడు కాలువలతో పాటు పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. మండలంలో సంజీవాపూర్ నుంచి సాతాపూర్ వరకు రోడ్డు పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం గుట్టల వద్ద మట్టిని తొలగిస్తున్నారు.

బీసీ కుల గణనతో న్యాయం

మన్ననూర్: బీసీ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోలి మల్లేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీ కుల గణన కోసం బీసీ సామాజిక వర్గాలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామన్నారు. దీంతో జనాభాలో సగ భాగంగా ఉన్న బీసీ వర్గాలకు అన్ని రంగాలలో సరైన ప్రాధాన్యత, సముచిత స్థానం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడు ఎంపిక




వెల్దండ: గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ఐటీటీ గాంధీ నగర్ నిర్వహించనున్న శిక్షణకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక అయ్యారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైన ఉపాధ్యాయులను డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ శంకర్‌నాయక్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

మల్లయ్య సేవలు మరువలేం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల దివంగత సర్పంచ్ మల్లయ్య సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని మార్చాలలో మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలాజీ సింగ్ మాట్లాడుతూ పదవిలో ఉండగానే ఆయన మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జగన్, నిజాముద్దీన్, శ్రీధర్‌రెడ్డి, భారతి, షానావాజ్‌ఖాన్, జలాల్, మక్బూల్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లెలమ్మ ఉత్సవాలు



కొల్లాపూర్: పట్టణ సమీపంలోని మల్లెలమ్మ ఉత్సవాలను మహేంద్ర(మ్యాదరి) కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మహేంద్ర సంఘం అధ్యక్షుడు పిన్నంశెట్టి బాలు, నాయకులు ప్యారసాని మురళి, పులి భరత్, సుధాకర్, వెంకటస్వామి, బాలయ్యతో పాటు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గ్రంథాలయం



వరండాలో పత్రికలు చదువుతున్న పాఠకులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పదేళ్లుగా లైబ్రేరియన్ నియామకం చేపట్టకపోవడంతో పుస్తకాల గదికి తాళం వేసే దర్శనమిస్తోంది. దీంతో పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న ఒకటి రెండు దిన పత్రికలను చదివి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార, మాస పత్రికలు ఏమాత్రం అందుబాటులో ఉంచడంలేదని విద్యార్థులు, యువకులు ఆవేదన చెందుతున్నారు.

రెండు వేలకు పైగా పుస్తకాలు

గ్రంథాలయంలో మహనీయులకు సంబంధించిన పుస్తకాలతోపాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం వంటి వివిధ రకాలైన రెండు వేలకు పైబడి పుస్తకాలు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. పుస్తకాల గదికి ఎప్పుడు తాళం వేసి ఉండడంతో చదవలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సెలవు దినాల్లోనూ గ్రంథాలయంలోని పుస్తకాలు చదివే అవకాశం లేదని వారు వాపోతున్నారు.

ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఉన్నా..

అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆమె నెలలో ఒకటి రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తోంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ వచ్చి వెళ్తుండటంతో పుస్తకాలు చదువుకునే వీలులేకుండా పోయిందని పాఠకులు వాపోయారు. ఎక్కువ రోజులు పుస్తకాలను కదిలించకపోవడంతో విలువైన పుస్తకాలను చెదలు పట్టి పోయాయి. ఇప్పటికే చాలా పుస్తకాలు పాడు కావడంతో వాటిని మూలన పడేశారు. గ్రంథాలయం పాఠకులకు ఎంతవరకు ఉపయోగపడుతుందనే అంశాన్ని అటు అధికారులుగాని, ఇటు ప్రజాప్రతినిధులు గాని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని రెగ్యూలర్ లైబ్రేరియన్‌ను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



స్థానిక గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ నియమించాలని అధికారులకు విన్నవించాం. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్నేళ్లుగా గ్రంథాలయంలో పుస్తకాలను ఇంటికి తీసుకొని చదువుకునేందుకు వీలులేకుండ పోయింది. గ్రంథాలయం ఎవ్వరికి ఉపయోగపడటంలేదు. సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– అనుపటి నాగరాజు, పాఠకుడు, ఉప్పునుంతల

ప్రమాదకరంగా రహదారి



శ్రీశైలం-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి

బల్మూర్: ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే శ్రీశైలం-నాగర్‌కర్నూల్-అచ్చంపేట ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రమాదకరంగా మారింది. మరమ్మతుపై ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనచోదకులు మండిపడుతున్నారు. మండలంలోని తుమ్మెన్‌పేట స్టేజీ నుంచి మహాదేవ్‌పూర్ స్టేజీ వరకు ఏడు కిలో మీటర్లు గుంతలమయంగా మారింది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి శ్రీశైలం వెళ్లే వాహనదారులు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేయడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుపై కంకర తేలి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోయారు. అధికారులు స్పందించి కనీసం ప్యాచ్ వర్కుతోనైనా గుంతలను పూర్చి రోడ్డును పూర్తి స్థాయిలో బాగుచేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నామమాత్రంగా నిర్వహణ పనులు



బల్మూర్-అచ్చంపేట ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు

బల్మూర్: అచ్చంపేట నుంచి బల్మూర్ మీదుగా లింగాల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చేపట్టిన ప్యాచ్ వర్కు పనులు తూతు మాత్రంగా కొనసాగుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ నామమాత్రంగా పనులు చేపడుత్నురు. రోడ్డుపై చాలా చోట్ల ఉన్న గుంతలను పూడ్చకుండానే చేతులేశాడు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్ల తొలగించలేదు. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఏమాత్రం పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: నియోజకవర్గ విద్యార్థుల కోసం కోసా సంస్థ ఆధ్వర్యంలో పాలిసెట్ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆసంస్థ అధ్యక్షుడు పి.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. కోసా యొక్క లక్ష్యాలను వారు మంత్రికి వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు హైదరాబాద్‌లో సాయిమేధ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 వతేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచిత కోచింగ్‌తో పాటు, బోర్డింగ్ వసతులు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సభ్యులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో రిటైర్డ్ డీఆర్‌ఓ మదన్‌మోహన్‌రావు, మియ్యాపురం రమేష్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో తూడి లక్ష్మమ్మ ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగనూర్ గ్రామానికి చెందిన తూడి లక్ష్మమ్మ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున లేచి చూసే సరికి ఇంటి, బీరువా తాళాలు విరగొట్టి బీరువాలో ఉన్న 20 గ్రాముల బంగారం, వెండి నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లిలో ఈ నెల 14 నుంచి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ సమీపంలో దుకాణాలు, తినుబండారాల సముదాయాలు వెలిశాయి. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి జాతరకు భక్తులు, ప్రజలు తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. రెండు మూడు రోజుల పాటు జాతర ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప పండుగ



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు

తెలకపల్లి: మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో ఆదివారం కురుమ కులస్తుల బీరప్ప పండుగలు కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ప్రధాన వీధుల్లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు బోనాలను అలంకరించుకుని ఊరేగింపుగా బయలుదేరారు. డప్పు చప్పుళ్ల మధ్య యువకులు నృత్యాలు చేశారు. వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం బీరప్ప దేవాలయం వద్ద నైవేద్యం సమర్పించారు. రెండు రోజులుగా గ్రామంలో పండుగ కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు.

22న బండలాగుడు పోటీలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 22న గురువారం అంతర్రాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 22న ఉదయం 11 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు ఇస్తామని వివరించారు. పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



వెల్దండ: మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చెందడంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు ఎర్రశ్రీనుముదిరాజ్, కృష్ణముదిరాజ్, పుల్లయ్య, హమీద్, మల్లేష్‌ముదిరాజ్, అల్లీ తదితరులు ఉన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధికం సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు కుటుంబసభ్యులతో తరలివచ్చారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన వారోత్సవాలు

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన పంచమ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లను నిర్వాహకులు పర్యవేక్షించారు.

20న చలో సచివాలయం

అచ్చంపేట రూరల్: ధూప దీప నైవేద్య పథకం కింద అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించనున్న చలో సచివాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అర్చక సంఘం నాయకులు శ్రీనివాసశర్మ, శ్రీకుమార్‌శర్మ, మురళీధర్ శర్మ, నాగరాజుశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. నూతనంగా నియామకమైన అర్చకులకు ఏడు నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అర్చకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

బెస్ట్ టీఎల్ఎం మేకర్లుగా ఎంపికైన ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వెంకటేష్, పద్మావతి రాష్ట్రస్థాయిలో బెస్ట్ టీఎల్ఎం మేకర్లుగా ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుడు వెంకటేష్ తయారుచేసిన జియోబోర్డు టీఎల్ఎంను, ఉపాధ్యాయురాలు పద్మావతి తయారుచేసిన మానవశరీర నిర్మాణం అనే టీఎల్ఎంను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ రామారావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకుపై ఆకట్టుకున్న శివాజీ చిత్రం



కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన విద్యార్థి యశ్వంత్‌కుమార్ పలు చిత్రాలను గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఆదివారం ఛత్రపతి శివాజీ చిత్రాన్ని ఆకుపై గీసీ పలువురి నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రెండు గంటల పాటు శ్రమించి ఆకుపై శివాజీ చిత్రన్ని గీశానని విద్యార్థి తెలిపారు. దీంతో పలువురు యశ్వంత్‌ను అభినందించారు.

అందుబాటులో యూరియా

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని సీఈఓ భాస్కర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్తా ధర రూ.270 చెల్లించి కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, అధార్‌కార్డు తీసుకొచ్చి యూరియాను పొందవచ్చని ఆయన తెలిపారు. రైతులు ఎరువులను బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసి నష్టపోవద్దని, సింగిల్ విండో కార్యాలయంలోనే కొనుగోలు చేయాలని కోరారు.

బీజేపీకి తగిన గుణపాఠం నేర్పాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వీపనగండ్ల: కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ సామాన్య ప్రజలు, రైతుల బాగోగులను పట్టించుకోకపోవడంలో ఘోరంగా విఫలమైందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠాన్ని నేర్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని తొలగించాల్సింది పోయి కులమతాల మధ్య తారతమ్యాలను సృష్టించి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తుందని దుయ్యబట్టారు. న్యాయమైన హక్కుల కోసం దేశ రాజధానిలో శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న రైతులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజల హక్కులను హరిస్తున్న బీజేపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం నేర్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం తొలగేనా?



రోడ్డు మధ్యలో గాంధీ విగ్రహం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుపై గాంధీ విగ్రహం ఉండటంతో ప్రతి నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు విస్తరణ సమయంలో గాంధీ విగ్రహాన్ని రోడ్డు మధ్య నుంచి తొలగించి గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మించినా.. నేటికీ విగ్రహన్ని తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. గ్రామపంచాయతీ వారు విగ్రహాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చినా.. పంచాయతీ పాలకమండలి సభ్యుల గడువు ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారులు స్పందించి రోడ్డు మధ్యలోని గాంధీ విగ్రహన్ని తొలగించి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం



పెద్దకొత్తపల్లిలో మహిళా సమాఖ్య భవనం


పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. తప్పని పరిస్థితుల్లో ఈ కార్యాలయంలోనే ప్రస్తుతం మహిళా సంఘాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గ్రూపు సమావేశాలు, బ్యాంకుల సంబంధించిన రుణాలకు సంబంధించిన చర్చలు ఇక్కడి నుంచే జరపాల్సిన దుస్థితి నెలకొంది. భవనం నిర్మించినా కాంట్రాక్టర్ తలుపులు కిటికీలు, ఫ్లోరింగ్ చేయకపోవడంతో మహిళా సమాఖ్య కార్యాలయం వారు భవనాన్ని స్వాధీనం చేసుకుని ఫ్లోరింగ్ లేనందున కింద కవర్లు వేసి కార్యాలయాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకొని మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఊర్కొండపేటలో ఆర్థిక సాయం అదజేస్తున్న స్నేహితులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో ఆపదలో ఉన్న తోటి మిత్రుని కుటుంబానికి పదో తరగతి విద్యార్థులు అండగా నిలిచారు. ఊర్కొండపేటకు చెందిన తిరుమని రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. 2004 బ్యాచ్‌కు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.34 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు మమత, నాజియా, సుమతి, శేఖర్, శంకర్, అశోక్‌రెడ్డి, శివశంకర్, కొండల్, ఖుర్షీద్, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బిజినేపల్లిలో..

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన జగదీశ్వరయ్య ఇటీవల మృతిచెందాడు. దీంతో 1996–1997 సంవత్సరానికి చెందిన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం జగదీశ్వరయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.23000 ఆర్థికసాయం అందజేశారు. కత్తె ఈశ్వర్, జైపాల్, చంద్రోజీ, మల్లీశ్వరి, వసంత, పార్వతమ్మ, లవకుమార్, గోపాల్, అగ్రహార శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.